దడ పుట్టిస్తున్న అద్దెలు!

● 5 నెలల అడ్వాన్స్ చెల్లిస్తేనే ఇల్లు అద్దెకు? ● ఏడాదిలో రెండు, మూడుసార్లు అద్దె పెంచేస్తున్న యజమానులు
● గేటెడ్ కమ్యూనిటీల్లో ఫిక్స్‌డ్ రెంట్ ● లబోదిబోమంటున్న సామాన్యులు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఇల్లు అద్దెకు కావాలని వస్తే ఇంటి యజమానులు సర్వ సాధారణంగా "మీరు ఏం చేస్తారు? ఎక్కడి నుంచి వచ్చారు? ఇక్కడ మీకు తెలిసిన వారు ఎవరైనా ఉన్నారా ? ఇంట్లో ఎంత మంది ఉంటారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలు వేసిన తర్వాతే ఇల్లు అద్దెకు ఇస్తారు. అయితే, ఇప్పుడు ఆ ట్రెండ్ మారిపోయింది. ఎలాంటి ప్రశ్నలు అడకుండానే "ఐదు నెలలు అద్దె అడ్వాన్స్ ఇవ్వండి.. ఈ రోజు నుంచి అద్దె ప్రారంభమవుతుందని ఓనర్స్ చెప్తున్నారు. రెండు నెలల్లో మీ ఇంట్లో దిగుతాం.. అప్పుడే అడ్వాన్స్ ఇస్తామంటే కుదరదు.. ఈ రెండు నెలల అద్దె ఎవరు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. కేపీహెచ్‌బీ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం అద్దె ఇంటి కోసం వెతుకుతున్న వారు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య ఇదీ.

15 నుంచి 25 శాతం పెంపు..

ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న కేపీహెచ్‌బీ ప్రాంతంలో ఇంటి అద్దెలను యజమానులు విపరీతంగా పెంచేస్తున్నారు. ఎవరైనా ఏడాది లేదా రెండేళ్లకు ఒకసారి పెంచుతుంటారు. కానీ.. ఇక్కడ మాత్రం వారికి ఎప్పుడు ఆలోచన వస్తే అప్పుడే అద్దెలు పెంచేసి అద్దెకు ఉండే వారిని వేధిస్తున్నారు. ఇలా ఏడాదికి రెండు, మూడుసార్లు పెంచే ఇంటి యజమానులు ఉన్నారు. ఇది నమ్మశక్యంగా కాకున్నా.. కేపీహెచ్‌బీ ప్రాంతంలో మాత్రం ఇలాంటివి కామన్ అని చెప్పవచ్చు. ఏడాదికి 5 లేదా.. 10 శాతం అద్దె పెంచుతుంటారు అనుకొని ఇంట్లోకి దిగితే మాత్రం ఆ ఏడాది మధ్యలో పెంచపోయినా ఆ తర్వాత మాత్రం కనీసం 15-25 శాతం మీ అద్దె పెరుగుతుందని లెక్క లేసుకుంటే మంచిది.

వేసవిలో ఇల్లు మారడం కామన్..

అద్దెలను పెంచుతూనే కనీసం ఐదు నెలల అద్దె అడ్వాన్స్‌గా తీసుకుంటున్నారు. అదే మంటే మీకు తెలియదా బెంగళూర్‌లో ఎంతో తెలుసా ? అని కొందరు ఇంటి యజమానులు అద్దెకు వచ్చే వారికి చెబుతున్నారు. ఇల్లు నచ్చితే కాస్త ఎక్కువ అద్దె, కండీషన్స్ ఉన్నా చేరిపోతున్నారు. వేసవి రాగానే చాలా మంది అద్దె ఇళ్ల కోసం చూడటం కామన్.. ఇల్లు మారాలనుకునే వారు.. కొత్త ఇల్లు కొనుక్కున్న వారు, ఉద్యోగాలు మారే వారు.. స్కూల్, కాలేజ్ ఇతరత్రా మార్పుల వల్ల ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మారడం అనివార్యమే. కానీ ఇప్పటికే పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పూర్తవ్వడంతో కొందరు ఇల్లు ఖాళీ చేశారు. దీంతో కొత్తగా అద్దెకు చూస్తున్న వారికి మాత్రం ఏ రోజు అడ్వాన్స్ ఇస్తే అదే రోజు నుంచి ఇంటి అద్దె చెల్లించాలని మెలికపెడుతున్నారు. లేదంటే ఇల్లు ఇవ్వలేం అని చెబుతున్నారు. ఇప్పుడు ఉంటున్న ఇంటిని ఖాళీ చేయడానికి ఇంకా నెల, రెండు నెలల సమయం ఉంది. ఆలోపు ఖాళీ చేద్దామంటే ఓనర్ ఒప్పుకోరు. రెండు చోట్ల అద్దె చెల్లించాలా ? ఉన్న దాంట్లోనే ఎంతో కొంత బేరమాడి అదే ఇంట్లో ఉంటే పోలే అని కొందరు సర్దుకుపోతున్నారు.

నామ్‌కే వాస్తే రెంటల్ అగ్రిమెంట్

ఐటీ ఉద్యోగులు అయితే రెంటల్ అగ్రిమెంట్ చేయించుకొని ఐటీలో చూపించుకుందాం అనుకుంటారు. కానీ చాలా మంది ఇంటి యజమానులు "మీరు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తే మేము తీసుకోం. మాకు నగదు రూపంలోనే ఇవ్వాలని చెప్తున్నారు. రెంటల్ అగ్రిమెంట్ కూడా 11 నెలలే ఉంటుంది. ఓనర్‌కు తెలిసిన వారు ఎవరైనా రెంట్‌కు వస్తామంటే వారు ఎంత వరకు అద్దె ఇవ్వగలరో చెక్‌చేసుకొని అప్పటికే ఇంట్లో ఉన్న వారిని ఖాళీ చేయించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం అద్దెకుంటున్న కుటుంబంతో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని భావిస్తే కొత్తవారు ఇస్తామన్న అద్దె భారాన్ని వారిపై మోపుతున్నారు. ఏటా పెంచుతున్న అద్దెల దెబ్బకు ఎంతో ఇష్టమైన ప్రాంతాన్ని విడిచి వేరే ప్రాంతాలనికి అద్దెకు వెళ్తున్న కుటుంబాల్లో కోకొల్లలు.



కేపీహెచ్‌బీలోని ఓ గేటెడ్ కమ్యూనిటీ గేట్‌కు అద్దె పేర్కొంటూ ఏర్పాటు చేసిన టూ లెట్ బోర్డు

రెంట్ రేట్ ఫిక్స్‌డ్

కొందరు గేటెడ్ కమ్యూనిటీలతో పాటు పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్స్ అసోసియేషన్లు ఇందులో అద్దెకు వచ్చే వారికి కనీస రెంట్ ఫిక్స్ చేస్తున్నాయి. కేపీహెచ్‌బీ నెక్సస్ మాల్ సమీపంలోని ఓ గేటెడ్ కమ్యూనిటీలోకి ఎంట్రీ కావాలంటే త్రీ బీహెచ్‌కే కనీస అద్దె రూ.60వేలు. మెయింటనెన్స్ ఇతరత్రా అదనం. అపార్ట్‌మెంట్‌కు జనరేటర్ పెట్టినా, పెయింటింగ్స్ వేసినా, లిఫ్ట్ పెట్టినా, కొత్తగా బోర్‌వెల్ వేసినా అందులో ఉన్నవారితో పాటు కొత్తగా వచ్చే వారికి భారీగా అద్దెలు పెంచుతున్నారు. ఒక వేళ ఎవరైనా తక్కువ అద్దెకు ఇచ్చినట్లు తెలిస్తే మీకు డబ్బులు ఎక్కువయ్యాయా ? మీ వల్ల మేమంతా నష్టపోతున్నాం, మీరు అద్దె పెంచుతారా ? లేదా అని ఒత్తిడి తెస్తున్నారు. దీంతో ఇంటి యజమానులు "ఎక్కడో ఉండి మేము అసోసియేషన్‌కు వ్యతిరేకంగా ఉండలేం. మీరు అద్దె పెంచండి. లేదంటే ఒకట్రెండు నెలల సమయం తీసుకొని ఖాళీ చేయండి" అని అద్దెకుంటున్న వారికి చెప్పే స్తున్నారు. ఇలాంటి సమయంలో ఓనర్లు, టెనెంట్స్ మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయి. టెనెంట్స్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. పేరుకే చట్టాలు ప్రయోజనం లేదంటున్నారు.


ఎంపీ ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న మోతీనగర్‌వాసులు

బీజేపీకి ప్రజల బ్రహ్మరథం

● మూసాపేట కార్పొరేటర్ మహేందర్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అన్నారు. బుధవారం మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన సుమారు 50 మంది మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ దేశ ప్రజలకోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ బలపడుతుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అత్యధిక సీట్లు సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. నగరంలోనూ అత్యధిక కార్పొరేటర్లను గెలిపించుకొని మేయర్ సీటు కైవసం చేసుకుంటా మన్నారు. కార్యక్రమంలో బీజేపీ మూసాపేట అధ్యక్షుడు ఎర్రస్వామి, ఉమానాయక్, వెంకటేష్ ముదిరాజ్, బాలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

దాహార్తిని తీర్చడం సామాజిక సేవలో భాగమే

బాలానగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడం సామాజిక సేవలో భాగమేనని బాలానగర్ సీఐ టి. నర్సింహరాజు, కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం బాలానగర్ గీతానగర్ కాలనీ ముఖ ద్వారం వద్ద రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రాన్ని వారు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సీఐ, కార్పొరేటర్‌లను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దొంతిరి సోమిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వీరేందర్‌రెడ్డి ట్రెజరర్ మహేందర్‌రెడ్డి. సంఘం సభ్యులు వెంకట్‌రెడ్డి, కిషోర్‌కుమార్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఖాజా, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, నర్రాదేవేందర్, శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొన్నారు.


ఈటలకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

డివిజన్లలోని సమస్యలను పరిష్కరించండి

● ఎంపీ ఈటలకు బీజేపీ నాయకుల వినతి

బాలానగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్, ఫతేనగర్, ఓల్డ్‌బోయినపల్లితో పాటు పలు డివిజన్ల బీజేపీ నాయకులు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో కలిశారు. తమ డివిజన్లలో నెలకొన్న సమస్యలను ఎంపీకి వివరించి వినతి పత్రాలను అందజేశారు. ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీని వారు కోరారు. కార్యక్రమంలో బాలానగర్ బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సురేందర్‌రెడ్డి, జి. రమేష్, పిట్ల మనోహర్, కొత్తూరి రమేష్, ఎర్ర స్వామి, కిరణ్‌కుమార్, శివరంజని రూప తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

అల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాణా ప్రతాప్ నగర్‌లో ఓ విద్యుత్ స్తంభం ఒక పక్కకు ఒరిగిపోవడంతో అది ఎప్పుడు ఎవరి మీద పడుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కేబుల్ బండిళ్ల బరువు కారణంగానో లేదా కొత్త ఇళ్లు నిర్మించే సమయంలో వాటికి తాకకుండా విద్యుత్ తీగలను సరిచేయటం వంటి కారణాలతో విద్యుత్ స్తంభాలు బ్యాలెన్స్ తప్పి ఓ పక్కకు ఒరిగి పోతున్నాయని స్థానికులు వాపోతు న్నారు. అధికారులు ప్రమాదకరంగా ఉన్న ఇలాంటి స్తంభాలను గుర్తించి తగు చర్య తీసుకొని ప్రమాదాలు జరగకుండా నివారించాలని రాణా ప్రతాప్ నగర్ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటేష్ అభ్యర్థిస్తున్నారు.


రాణా ప్రతాప్ నగర్‌లో ఓ పక్కకు ఒరిగిపోయిన స్తంభం


సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

బీఆర్‌ఎస్ నేత సత్యనారాయణకు ఎమ్మెల్యే నివాళి

ఫతేనగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్ మాజీ వార్డు మెంబర్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సత్యనారాయణ మృతిపట్ల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణ వార్త తెలుసుకున్న ఆయన బేగంపేటలోని సత్యనారాయణ నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యనారాయణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించాలని వారిని కోరారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మౌలిక వసతుల కల్పనకు అధికారులు నిధులు వెచ్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్పొరేటర్ శిరీష బాబూరావు అన్నారు. ఈ మేరకు బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని హబీబ్‌నగర్‌లో రూ.60 లక్షలతో సీసీ రోడ్డు, శక్తినగర్‌లో రూ.60లక్షలతో వర్షపునీటి కాల్వ పనులకు బుధవారం కార్పొరేటర్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. లోతట్టు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వర్షాకాలం లోపు నాలాల్లో పూడికతీత పనులు పూర్తిచేయాలన్నారు. డివిజన్ పరిధిలో పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. పనుల్లో వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ శ్రవణ్ కుమార్, బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు సీహెచ్ ప్రభాకర్ గౌడ్, జైరాజ్, అశోక్, యాదుల్, ఖదీర్, రషీద్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా హనుమాన్ జయంతి జరుపుకోవాలి

● బాలానగర్ ఏసీపీ హనుమంత రావు

బాలానగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతిని శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బాలానగర్ ఏసీపీ హనుమంత రావు,సీఐ నర్సింహరాజు సూచించారు.ఈ నెల 12న జరిగే హనుమాన్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో బుధవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఏసీపీ మాట్లాడుతూ, పరిమితికి మించి శబ్దంతో కూడిన సౌండ్ బాక్స్‌లు వాడరాదని, డీజేకు అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. సీఐ నర్సింహ రాజు మాట్లాడుతూ, హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించాలనుకునే వారు అనుమతుల కోసం ముందే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనుమతులు పొందిన వారికి సైబరాబాద్ పోలీసుల తరఫున పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఏసీపీ తెలిపారు. సమావేశంలో డీఐ నాగారెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ్, సరితారెడ్డి, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ హనుమంతరావు

సన్నబియ్యంతో పేదల ముఖాల్లో ఆనందం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి

బాలానగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా సరఫరా చేస్తున్న సన్న బియ్యం తింటున్న ప్రతి పేద వాడి ముఖంపై ఆనందం వెల్లి విరుస్తోందని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచించిన నేపథ్యంలో సన్న బియ్యంపై విస్తృత ప్రచారం చేసేందుకు జిల్లా నాయకులు పూనుకున్నారు. బుధవారం బాలానగర్‌కు చెందిన సీనియర్ కార్యకర్త, శాగరవి ముదిరాజ్ ఇంట్లో సన్న బియ్యంతో అన్నం వండించుకొని సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్, మహిళా నాయకురాలు పుష్పమ్మ, సీనియర్ నాయకుడు లక్ష్మయ్య, పులి శ్రీకాంత్‌పటేల్, పులి శివకుమార్‌గౌడ్ తదితర నేతలంతా సహ పంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నా బీఆర్‌ఎస్ నేతలు ఇంకా బురద చల్లేందుకు కుట్రలు పన్నడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో ఏర్పుల మహేందర్, సదానంద్, శేఖర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సన్న బియ్యంతో అన్నం వండించుకొని తింటున్న కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్‌రెడ్డి, బండి రమేష్ తదితరులు

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఏఐసీసీ పిలుపు మేరకు బుధవారం కేపీహెచ్‌బీలో జై బాపు- జై భీమ్- జై సంవిధాన్ పేరుతో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల సంయుక్త ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ మెయిన్‌రోడ్డు గాంధీ విగ్రహం నుంచి రమ్యగ్రౌండ్ వరకు నిర్వహించారు. ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ ఉజ్మా, మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం, నియోజకవర్గ మాజీ అధ్యక్షులు శేరి సతీష్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణ రాజ్‌పుత్ పాల్గొన్నారు.


పాదయాత్రలో పాల్గొన్న ఏఐసీసీ మెంబర్ ఉజ్మా తదితరులు


రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

ఘనంగా రథయాత్ర

హైదర్‌నగర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ సప్తగిరి కాలనీలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన రథయాత్రలో సీనియర్ నాయకుడు నాయినేని చంద్రకాంత్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు, రథయాత్రను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు చంద్రశేఖర్, శర్మ, నాయకులు దేవినేని ప్రసాద్, చంద్రశేఖర్, హర్ష, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నల్లచెరువు సుందరీకరణ పనులు

● సుమారు రూ.9 కోట్లు కేటాయింపు
● హైడ్రా పర్యవేక్షణలో పనులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులు హైడ్రా అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. అందులో భాగంగా మొద టి విడతగా 6 చెరువులను రూ. 58.50కోట్లతో తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, సున్నం చెరువు, ఉప్పల్ నల్లచెరువు, రాజేంద్రనగర్‌లోని చెరువు, బతుకమ్మకుంటలను సుందరీకరణ చేయనున్నారు. అందులో భాగంగా కూకట్‌పల్లి నియోజవర్గం పరిధిలో ఉన్న సున్నం చెరువు, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో ఉన్న నల్లచెరువు సుందరీకరణకు సుమారు రూ.9 కోట్లు కేటాయించారు.

ముందుగా వ్యర్థాల తొలగింపు

కూకట్‌పల్లి గ్రామానికే తలమానికంగా ఉన్న నల్లచెరువు ఇళ్ల మధ్య ఉండటంతో దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. నీటితో ఎప్పుడూ నిండు కుండలా ఉండటంతో చుట్టుపక్కల కాలనీలకు భూగర్భజలాలు సమృద్ధిగా లభిస్తాయి. హైడ్రా అధికారులు సుందరీకరణ పనుల కోసం మొదటగా చెరువులోని వ్యర్థాలను బయటకు పంపే ప్రక్రియ మార్చి నెలలో ప్రారంభించారు. చెరువులో ఉన్న నీటిని మోటార్ల సహాయంతో బయటికి తోడేశారు. సుమారు 20 రోజుల్లో చెరువులోని నీటిని మొత్తం బయటకు తోడేశారు. పనుల వివరాలను హైడ్రా లేక్ ప్రొటెక్షన్ సిబ్బంది ఎప్పటికప్పుడు హైడ్రా ఉన్నతాదికారులకు పంపిస్తున్నారు.


నల్లచెరువులో పూడికతీత పనులను ప్రారంభించిన దృశ్యం

అకాల వర్షంతో చెరువులోకి మళ్లీ నీరు

చెరువులో మొత్తం నీటిని హైడ్రా సిబ్బంది ఎంతో కష్టపడి బయటకు పంపించారు. అయితే, అకాల వర్షం వల్ల నల్లచెరువులో మళ్లీ నీరు చేరింది. దాంతో నీటిని మళ్లీ బయటకు పంపిచాల్సిన పరిస్థితి నెలకుంది.

పూడికతీత పనులు షురూ

నల్లచెరువు సుందరీకరణ పనులు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. నల్లచెరువు పార్కు సమీపంలో పూడికతీత పనులు అధికారులు ప్రారంభించారు. ప్రోక్లెయినర్‌తో పూడికను తీయించనున్నారు. దీంతో నల్లచెరువును ఆనుకుని ఉన్న పార్కులో వాకింగ్, వ్యాయామం కోసం వచ్చిన స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


రౌడీషీటర్లకు సూచనలు చేస్తున్న బాలానగర్ సీఐ నర్సింహరాజు

మంచి నడవడికతో జీవించండి

● రౌడీషీటర్లకు సీఐ సూచన

బాలానగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పసికడుతూ వారిపై గట్టి నిఘా పెట్టామని చేశామని బాలానగర్ సీఐ టి.నర్సింహ రాజు అన్నారు. బుధవారం ఉదయం బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో బాలానగర్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆయన పలు హెచ్చరికలు జారీ చేశారు. గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో హుందాగా జీవించాలని సీఐ సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలని భవిష్యత్తును, కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవర్తన, నడవడిలో మార్పు తెచ్చుకోవాలని సీఐ నర్సింహ రాజు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రాంనారాయణ్, సరితారెడ్డి, వినోద్ సిబ్బంది పాల్గొన్నారు

నిర్మానుష్యంగా రోడ్లు



హైదర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మే నెల రాకముందే ఎండలు మండిపోతున్నాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే కూకట్‌పల్లిలోని రోడ్లన్నీ ఠారెత్తిస్తున్న ఎండల కారణంగా బుధవారం నిర్మా నుష్యంగా మారాయి. నిజాంపేట రోడ్, జేఎన్‌టీయే రోడ్, వివేకానందనగర్ రోడ్‌లు జనసంచారం లేక వెలవెల పోయాయి.

విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్లకొమ్మల తొలగింపు

అల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానంద నగర్ ప్రధాన రహదారిలో 'సుబాబుల్' చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తాకడంతో తరచూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అవుతోందని స్థానికులు కార్పొరేటర్ సబీహా బేగం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బుధవారం ఆమె షార్ట్ సర్క్యూట్‌కు కారణమవుతున్న చెట్లను పరిశీలించారు. విద్యుత్ శాఖ ఏఈ రాకేష్, అర్బన్ బయోడైవర్సిటీ అధికారులను సంప్రదించిన ప్రత్యేక క్రేన్ సహాయంతో విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగింపుజేశారు. అల్లాపూర్ డివిజన్‌లో విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను గుర్తించి షార్ట్ సర్క్యూట్ కాకుండా ట్రిమ్మింగ్ చేయించాలని అధికారులను కార్పొరేటర్ సబీహా బేగం ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో బొల్లు శ్రీనివాస్ రావు, రోణంకి జగన్నాథం, తుంగం శ్రీనివాస్ రావు, నవులూరి రోశయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

హైదర్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో స్థానికులు శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, నాగేశ్వరరావు, శివకృష్ణ, ఎస్ఆర్‌పి గోపాల్‌నాయల్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో ..

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఎక్కువ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని జనసేన పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అన్నారు. ఈ మేరకు జనసేన పార్టీ యువకులు పుప్పాల అంజి, సుంకర సత్యసాయి ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

జలమండలి ఎండీని కలిసిన కార్పొరేటర్ శిరీష

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ అంబేద్కర్‌నగర్ డ్రైనేజీ అవుట్‌లెట్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కార్పొరేటర్ పగుడాల శిరీష బాబూరావు బుధవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి విన్నవించారు. కూకట్‌పల్లి కోర్టు నిర్మాణ సమయంలో ముళ్లకత్వ చెరువు వద్ద తలెత్తిన సమస్య వల్ల స్థానికంగా ఉన్న ఇళ్లలోకి మురుగు నీరు చేరుతుం దన్నారు. వర్షాకాలంలో లోపు ఔట్‌లెట్‌కు పరిష్కారం చూపించాలని విజ్ఞప్తి చేశారు.


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్


ఉప కమిషనర్‌కి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడి టీచర్లు

గౌరవ వేతనం ఇవ్వండి

చందానగర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): కులగణన చేసిన అంగన్‌వాడి టీచర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం చందానగర్ సర్కిల్ -21 ఉప కమిషనర్ పి.మోహన్‌రెడ్డికి వినతి పత్రం అంద జేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేలో అన్ని ప్రభుత్వ విభాగాలతో పాటు అంగన్ వాడి టీచర్లు కూడా సర్వే చేశారు. ఇప్పటికీ నాలుగు నెలలు గడుస్తున్నా నేటి వరకు తమకు గౌరవ వేతనం ఇవ్వలేదని వారు ఆవేదనవ్యక్తం చేశారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీఐటీయూ కన్వీనర్ కృష్ణ, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.


రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించిన ఉప కమిషనర్ ప్రణీత

నేతల్లారా సహకరించండి..
నిజమైన ఓటరు లిస్టు తయారుచేస్తాం

గచ్చిబౌలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయ పార్టీల సహకారంతోనే నిజమైన, తప్పులకు తావులేకుండా ఓటరు లిస్టు రూపొందుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎన్నికల అధికారి, ఉప కమిషనర్ ప్రణీత అన్నారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఓటరు లిస్టులో తప్పులున్నాయని, ఎలా సరిచేయాలో కూడా చెప్పాలని అందుకు అనుకూలమైన సమాచారాన్ని కూడా అందజేయాలని కోరారు. ఓటర్లలో చనిపోయిన వారి పేర్లు ఉన్నాయి.. అంటున్నారే కానీ తగిన సమాచారం ఇస్తే వాటిని తొలగించేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తొలగించలేమని స్పష్టంచేశారు. ఓటరు లిస్టులో నియోజకవర్గంలో ఒక ఓటును మాత్రమే కలిగి ఉండాలని, ఒకరికి రెండు, మూడు ఉన్నాయని ఫిర్యాదు చేస్తున్నారు కానీ, తగిన ఆధారాలు ఇవ్వడంలేదని డీసీ అన్నారు. ఓటరు లిస్టులో తప్పులను సవరించుకునే అవకాశం ఉందని, మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం కూడా ఉందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప కమిషనర్ ప్రణీత పిలుపునిచ్చారు. అంతే కాకుండా 19 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, సీపీఐ, ఎంసీపీఐ, తెలుగుదేశం పార్టీలకు చెందిన నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


వరదనీటి కాల్వ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

వరదనీటి కాల్వ పనుల పరిశీలన

మియాపూర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ డివిజన్ గుర్నాథం చెరువు నుండి పటేల్‌చెరువు వరకు నూతనంగా నిర్మాణం చేపట్టిన వరదనీటి కాల్వ నిర్మాణ పనులను బుధవారం కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ఎస్ఎన్‌డీపీ అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులు, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, గుర్నాథం చెరువు నుండి పటేల్‌చెరువు వరకు నూతనంగా నిర్మాణం చేపట్టిన వరదనీటి కాల్వ నిర్మాణ పనులను పరిశీలించామన్నారు. వీడియోకాలనీ, ఎఫ్‌సీఐ కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు వరదనీటి కాలువ పనులలో కొన్ని మార్పులు చేర్పులు చేసేవిధంగా సంబంధిత అధికారులు, కాలనీ వాసులతో కలిసి చర్చించామని తెలిపారు. అదేవిధంగా ఈ సమస్యను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ దృష్టికి తీసుకువెళ్లి చర్చించి త్వరలోనే పనులను పునఃప్రారంభించి పూర్తిచేస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఉమా కిషన్, మియాపూర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు సుప్రజ, కప్పెర రమేష్, కాలనీ వాసులు రవీందర్‌రెడ్డి, జగన్, ఎంవి రావు, సాల్మన్ పాల్గొన్నారు.

చందానగర్ పోలీస్‌స్టేషన్ సీఐగా సుంకరి విజయ్

చందానగర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): చందానగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సుంకరి విజయ్ బదిలీపై వచ్చారు. ఈ స్టేషన్‌లో సీఐగా పనిచేసిన పాలవెల్లి సైబరాబాద్ కమిషనరేట్‌కు క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో షేక్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన సుంకరి విజయ్ వచ్చారు.


ఆల్విన్‌కాలనీలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

చలివేంద్రం ప్రారంభం

హైదర్‌నగర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలో ఉన్న డంపింగ్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో స్థానికులు శివరాజ్‌గౌడ్, పోశెట్టిగౌడ్, వాసుదేవరావు, నాగేశ్వరరావు, శివకృష్ణ, ఎస్ఆర్‌పి గోపాల్‌నాయల్ తదితరులు పాల్గొన్నారు.


ఆలె నరేందర్ 11వ వర్ధంతిని పురస్కరించుకుని ఆల్విన్‌కాలనీ జలకన్య హోటల్ సెంటర్‌లోని నరేంద్రపార్కులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు రంగారావు, పుట్టా శివశంకర్‌నేత తదితరులు -హైదర్‌నగర్, (ఆంధ్రజ్యోతి)

స్విమ్మింగ్.. ఆరోగ్యానికి ఎంతో మేలు

- మానసిక ప్రశాంతతకు, శారీరక ధృఢత్వానికి ఈత ఎంతో ఉపయోగకరం
- నిపుణుల సమక్షంలో నేర్చుకుంటే మంచిది

చందానగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిత్యం పుస్తకాలతో కుస్తీపట్టే విద్యార్థులు వేసవి సెలవులు అంటేనే కేరింతలు వేస్తారు. ఈత నేర్పడానికి స్విమ్మింగ్ పూల్స్ అనేకం అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుత తరుణంలో వ్యాయామం, యోగా, వాకింగ్, ఏదో ఒక నచ్చిన స్పోర్ట్స్ తప్పనిసరి. ప్రజలు నిత్యం వివిధ రకాల పనుల ఒత్తిళ్లకు గురై అనారోగ్యాల పాలవుతున్నారు. మారుతున్న జీవన విధానం, వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మానసిక ప్రశాంతత ఉండాలంటే వ్యాయామం, స్పోర్ట్స్, ఈత తదితరాలు ఎంతో అవసరం. జీవితంలో వీటితో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉంది. ఈత కూడా మనకు మేలు చేస్తుంది. శేరిలింగంపల్లి మండలంలో సుమారు 100 స్విమ్మింగ్ పూల్స్ ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ఈత వల్ల ఎన్నో ప్రయోజనాలు

1. బరువు తగ్గడం 2. కొవ్వు తగ్గుదల 3. నిద్ర బాగా పట్టడం 4. నడుము, వెన్నునొప్పి మాయం కావడం 5. ఎముకలు, ఊపిరితిత్తులు ధృడంగా మారడం 6. వివిధ ఒత్తిళ్ల నుంచి మానసిక, శారీరక ప్రశాంతత ఏర్పడడం. 7. శారీరక అవయవాల అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది.


చందానగర్ పీజేఆర్ స్టేడియం సమీపంలో స్విమ్మింగ్ పూల్

30 నిమిషాల్లో శరీరానికి వచ్చే క్యాలరీలు ఇవే

1. నిద్రలో 28 క్యాలరీలు 2. వాకింగ్ చేయడంతో 178 క్యాలరీలు 3. సైకిల్ తొక్కడంతో 355 క్యాలరీలు 4. స్కిప్పింగ్ చేయడంతో 444 క్యాలరీలు 5. రన్నింగ్ చేయడంతో 488 క్యాలరీలు 6. స్విమ్మింగ్ చేయడంతో 488 క్యాలరీలు శరీరంలో ఉత్పన్నమవుతాయి.

నేర్చుకునే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఈత నేర్చుకోనే సమయంలో తప్పకుండా వీటిని పరిగణలోకి తీసుకోవాలి. ఆద మరిస్తే భారీ నష్టం సంభవిస్తుంది. 1. పెద్దల, కోచ్ సమక్షంలో ఈతను నేర్చుకోవాలి. 2. లోతుకు వెళ్లకూడదు. 3. ఆహారం తీసుకున్న రెండుగంటల తరువాతే ఈతకు వెళ్లాలి. 4. ఎత్తునుండి దూకడం చేయకూడదు. 5. నేర్చుకునేవారు స్విమ్మింగ్ సూట్, క్యాప్, అద్దాలు, ట్యూబ్ తప్పకుండా ధరించాలి.

ఆరోగ్యానికి ఎంతో మంచిది



చిన్నప్పటి నుంచి ఈత అంటే ఎంతో ఇష్టం. ఊర్లో చిన్నప్పుడు చెరువులో, వాగులో నేర్చుకున్నా. దీంతో మక్కువ పెంచుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మాస్టర్ స్విమ్మర్‌గా అనేక పథకాలు, అవార్డులు, విజయాలు సాధించా. ప్రస్తుతం ప్రతీ ఒక్కరు ఆరోగ్య పరిరక్షణ కోసం మనకు నచ్చిన స్పోర్ట్స్‌లో నిత్యం ఉండాలి. పిల్లలకు వీటిపై బాల్యదశనుంచే అలవాటు చేసుకునే విధంగా పెద్దలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి.

- కొండా విజయ్‌కుమార్, అంతర్జాతీయ ఈతగాడు

బాల్యదశ నుంచే అలవాటు చేయాలి



ఈతపై పిల్లలకు బాల్యదశ నుంచే అవగాహన కల్పించాలి. నాకు ఈత అంటే ఎంతో ఇష్టం, జాతీయస్థాయి పోటీల్లో వివిధ పతకాలు, అవార్డులు సాధించా. గత 9సంవత్సరాల నుంచి స్విమ్మింగ్‌లో చిన్నారులకు కోచింగ్ ఇస్తున్నా.

- సత్య, స్విమ్మింగ్ పూల్ మేనేజర్

శంకర్‌గౌడ్ పార్థీవ దేహానికి నివాళులు

రాయదుర్గం, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు కొమరగౌని శంకర్‌గౌడ్ మృతిచెందిన విషయం తెలుసుకుని గచ్చిబౌలి ఖాజాగూడలోని ఆయన నివాసానికి వెళ్లి ఆయన పార్థీవదేహానికి ఎమెల్యే ఆరెకపూడి గాంధీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శంకర్‌గౌడ్ మృతి తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. ఆయన మరణంతీరని లోటని, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌గౌడ్, బాలింగ్ గౌతమ్‌గౌడ్, మంత్రి ప్రగడ సత్యనారాయణ, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.


పార్థీవదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కొండాపూర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి: సీపీఐ

గచ్చిబౌలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల బతుకులు అగమ్యగోచరంగా తయారువుతున్నాయని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గం సభ్యుడు రామకృష్ణ ఆరోపించారు. కేంద్రం పెంచిన గ్యాస్ ధరలను నిరసిస్తూ సీపీఐ నాయకుడు చందు యాదవ్ ఆధ్వర్యంలో కొండాపూర్ చౌరస్తాలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ, రోజు రోజుకు నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, ఇప్పటికే పెద ప్రజలు మోయలేని స్థితిలో ఉన్నారని తాజాగా మళ్లీ గ్యాస్ ధరలు పెంచి వారిపై మరింత భారం మోపడం తగదని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతూ ఉంటే దేశంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని ఆందోళనవ్యక్తం చేశారు. 2014 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం స్విస్ బ్యాంకులో ఉన్న భారత దేశానికి సంబంధించిన నల్లధనాన్ని వెంటనే తీసుకువచ్చి పేదలకు పంచాలని డిమాండ్ చేశారు.

పేదల ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని హామీఇచ్చి నిలుపుకోలేదని విమర్శించారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో సుధాకర్, తుపాకుల రాములు, కొండల్, లక్ష్మమ్మ, వరలక్ష్మి, నారాయణ, శ్రీనివాస్, శివకుమార్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తమార్కండేయ ఆలయానికి ప్రధానద్వారం విరాళం


కుటుంబ సభ్యులతో కలిసి పూజల్లో పాల్గొన్న జిల్లా గణేష్‌నేత

హైదర్‌నగర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన జిల్లా గణేష్‌నేత ఆయన తండ్రి కీర్తిశేషులు జిల్లా సహదేవ్ జ్ఞాపకార్థంగా సిద్దిపేట జిల్లా కొండపాక మండలంలో నూతనంగా నిర్మిస్తున్న శివభక్త మార్కండేయ స్వామి ప్రధాన ద్వారం విరాళంగా అందజేశారు.

ఈ సందర్భంగా దేవాలయంలో నిర్వహించిన పూజల్లో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

ఆదర్శనేత చంద్ర రాజేశ్వరరావు : సీపీఐ నేత ప్రతాప్‌రెడ్డి

మియాపూర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీలో అత్యున్నత స్థానంలో ఉన్న తానొక గొప్ప సిద్ధాంతవేత్తననే బడాయిని ప్రదర్శించక ఆడంబరం ఎరుగని నేత చంద్ర రాజేశ్వర రావు అని సీపీఐ సీనియర్ నాయకుడు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి అన్నారు. చంద్ర రాజేశ్వరావు 31వ వర్ధంతి సందర్భంగా బుధవారం కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని ఆయన విగ్రహానికి సీపీఐ నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ, వంద సంవత్సరాల కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో భారత జాతీయ ఉద్యమంలోను, స్వాతంత్ర్య ఉద్యమం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జమీందారి జాగీరుదారి భూస్వామ్య వ్యవస్థను నిర్మూలించడంలో చంద్ర పాత్ర చెప్పుకో తగినదన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య, లౌకికవాద రక్షణకు, దేశ సమైక్యతకు కృషిచేసిన గొప్ప మానవతావాది ఆయన అని కొనియాడారు. కార్యక్రమంలో సీఆర్‌ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఫౌండేషన్ కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర రావు, పిడికిటి సంధ్యాకుమారి, ఉపాధ్యక్షుడు కంభంపాటి అజయ్, కోశాధికారి చెన్నకేశవరావు, ఏఐటీయూసీ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ కె.రజిని, మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ కల్పన పాల్గొన్నారు.


చంద్రరాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు, ఫౌండేషన్ ప్రతినిధులు

ఘనంగా సీతారాముల పట్టాభిషేకం

హైదర్‌నగర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకుని వివేకానందనగర్ డివిజన్ సప్తగిరికాలనీలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరిగిన రథయాత్ర కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాయినేని చంద్రకాంత్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు, రథయాత్ర ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీరామనవమి అనంతరం జరిగే సీతారాముల పట్టాభిషేకం కన్నుల పండువగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానికులు చంద్రశేఖర్, శర్మ, నాయకులు దేవినేని ప్రసాద్, చంద్రశేఖర్, హర్ష, ప్రదీప్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మండే ఎండలతో నిర్మానుష్యంగా మారిన నిజాంపేట్, జేఎన్‌టీయూ, వివేకానందనగర్ రోడ్లు

ఠారెత్తిస్తున్న ఎండలు.. ప్రయాణికుల బెంబేలు

హైదర్‌నగర్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): మే నెల రాకముందే ఎండలు మండిపోతున్నాయి. ఠారెత్తిస్తున్న ఎండలతో కూకట్‌పల్లిలో బుధవారం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు, జనంతో కళకళలాడే రహదారులు జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయాయి. నిజాంపేట్ రోడ్, జేఎన్‌టీయూ రోడ్డు, వివేకానందనగర్ రోడ్లలో కనిపించిన దృశ్యమిది.

బోరుబావిని బాగు చేయించరూ..

గచ్చిబౌలి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి సౌకర్యంలేక సిబ్బంది, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలల క్రితం ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న బోరుబావి పాడైపోయింది. అయినా అధికారులు రిపేరు, లేదా కొత్త మోటారును కానీ బిగించలేదు. దీంతో సిబ్బంది నీటికోసం అనేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం అప్పట్లోనే సిబ్బంది జిల్లా అధికారులకు తెలియజేశారు. డీఅండ్ హెచ్ఓ వెంకటేశ్వర రావు, కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన స్వయంగా బోరుబావిని పరిశీలించారు. త్వరలో నిధులు వస్తాయని చెబుతున్నా.. నిధులు మాత్రం ఇప్పటికీ రాలేదు.


పీహెచ్‌సీలో చెడిపోయిన బోరుబావి



వంటింట్లో గ్యాస్ మంటలు

భెల్‌కాలనీ, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులపై కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరను రూ.50 పెంచి మరింత భారం మోపుతోంది. ఈ పెరుగుదల పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వంట నూనె ధరలు రూ.143 నుండి రూ.175 వరకు పెరిగి సామాన్యులపై భారం పడుతుండగా మంగళవారం నుండి పెరిగిన గ్యాస్ ధరలు అమలులోకి రావడంతో సామాన్యుడిపై మరోసారి భారం మోపింది కేంద్ర ప్రభుత్వం. పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని పెంచిన కేంద్రం మరో షాకింగ్ ప్రకటన చేసి వెంటనే అమలు పరిచింది. ఇప్పుడు 14.2 కిలోల వంటగ్యాస్ సిలిండర్ రూ.855 ఉండగా దానిని రూ.905 పెంచి, ఉజ్వల యోజన పథకం లబ్ధిదారులకు కూడా ఈ పెంపు వర్తిస్తుందని స్పష్టం చేసింది. దీంతో వంట గ్యాస్ ధరలు మంటలు పుటిస్తున్నాయి. ఒకేసారి సిలిండర్‌పై రూ.50 పెంచడం మహిళలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ బెంబేలెత్తిపోతున్నారు. గ్యాస్ వినియోగాన్ని పెంచి మహిళా సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ప్రభుత్వం గొప్పలు చెబుతూ.. మరోవైపు ధరలు పెంచి ఆర్థిక భారం మోపుతోందన్న ఆవేదన వ్యక్త మవుతోంది.

పేద.. మధ్య తరగతి కుటుంబాలపై ప్రభావం



కేంద్రం పెంచిన గ్యాస్ ధరల వల్ల మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఒక పక్క పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నూనెదినుసులు, పాఠశాలల ఫీజులతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుంటుంబాలపై ఒక్కసారిగా రూ.50 పెరిగి భారంగా మారుతుంది. పెంచిన ధరలపై ప్రభుత్వం పునరాలోచించాలి. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో చర్చించి, తగ్గించేలా చూడాలి. సామాన్యులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం నిత్యావసర ధరలను అదుపుచేయడంలో పూర్తిగా విఫలమైంది. పెరిగిన ధరలను కట్టడి చేయకుండా వంటగ్యాస్ ధరను పెంచి మరింత భారం మోపుతోంది.

- సింధూ ఆదర్శ్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్, భారతీనగర్ డివిజన్



చంద్రానగర్‌లో మురుగునీరు లీకేజీలకు మరమ్మతులు చేసిన దృశ్యం

లీకేజీలకు అడ్డుకట్ట

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని చంద్రానగర్ రోడ్ నంబర్ 2లో పది రోజులుగా భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నుంచి మురుగునీరు లీకవుతుండటంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయంపై బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో రోడ్డుపై పారుతున్న మురుగు శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మ్యాన్‌హోల్‌ను తవ్వించి మురుగునీరు లీకేజీలకు మరమ్మతులు చేయించారు. సమస్యను పరిష్కరించడంలో సహకరించిన ఆంధ్రజ్యోతికి స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



గుంతను పూడ్చిన అధికారులు

గాజులరామారం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గుంతను పూడ్చడంలో అధికారుల అలసత్వం అనే శీర్షికన ఈ నెల 7వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం గాజులరామారం డివిజన్ బాలానగర్‌లో మంచినీటి పైప్‌లైన్ కోసం జలమండలి అధికారులు తవ్వి వదిలేసిన గుంతను పూడ్చివేశారు. దీంతో స్థానికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

కొంపల్లిలో బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి



ఎండలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



ఎండ వేడిమి తాళలేక చెట్టు నీడన నిలబడిన ప్రయాణికులు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కొంపల్లి నుంచి వెళ్ళే రాష్ట్ర, దేశ రాజధానిని కలిపే ఎన్‌హెచ్-44 రహదారి నిరంతరం రద్దీగా ఉంటుంది. ఈ పురపాలక సంఘం పరిసర ప్రాంతాల్లో అంతర్జాతీయ పాఠశాలలు, జూనియర్ ఇంజనీరింగ్, మెడికల్, బిజినెస్ కళాశాలలతో పాటు ప్రఖ్యాతి గాంచిన విద్యాసంస్థలు ఉన్నాయి. వీటిల్లో చదువుకునే సుమారు ఐదువేలమందికి పైగా విద్యార్థులు కొంపల్లి పట్టణ బస్‌స్టాండ్ నుంచే ప్రయాణాలు చేస్తుంటారు. అంతే కాకుండా ఈ ప్రాంతం అనేక వ్యాపార కార్యక్రమాలకు నిలయం. ఆదిలాబాద్, నిజామాబాద్, నిర్మల్ వంటి జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ వంటి పలు రాష్ట్రాలకు ఈ మార్గం నుంచే బస్సులు వెళుతుంటాయి. దూలపల్లి, బహదూర్‌పల్లి, మచ్చబొల్లారం, గుండ్లపోచంపల్లి తదితర ప్రాంతాల్లో బతుకుదెరువు కోసం వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చినవారు నివసిస్తుంటారు. వారి దినచర్యలో భాగంగా రాకపోకలు కొంపల్లి పట్టణం మీదుగా సాగిస్తుంటారు. ప్రజల సౌకర్యార్థం బస్ షెల్టర్ లేక లేక ఎండలోనే నిలబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. అసలే వేసవి, ఈ సంవత్సరం భానుడి ప్రతాపం ఎక్కువగా ఉంది. అలాగే ఈ ప్రాంతంలో బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో ట్రాఫిక్ జాం, వాహన కాలుష్యం, దుమ్ము, దూళి ఇలాంటి దయనీయమైన స్థితిలో ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సిందే. అధికారులు బస్సు షెల్టర్ ఏర్పాటుచేయడంలో నిర్లక్ష్య ధోరణి వహిస్తున్నారని ఆ ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వేసవిని దృష్టిలో పెట్టుకొని బస్ షెల్టర్లను అవసరం ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని విద్యార్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండ నుంచి ఉపశమనం కల్పించండి



బస్ షెల్టర్ ఏర్పాటు కోసం అధికారులకు వినతి పత్రాలను అందజేశామని బీజేపీ కొంపల్లి పట్టణ అధ్యక్షులు సతీష్‌సాగర్ అన్నారు. ఏప్రిల్, మేలో ఎండలు విపరీతంగా ఉండడాన్ని దృష్టిలో పెట్టుకొని బస్‌షెల్టర్‌ను ఏర్పాటుచేసి ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగించేలా కృషి చేయాలని కోరుతున్నాం.

- సతీష్ సాగర్, బీజేపీ నాయకులు



సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న శ్రీశైలంగౌడ్

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం: శ్రీశైలంగౌడ్

షాపూర్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అందజేశారు. సూరారం డివిజన్ షాపూర్‌నగర్‌లోని ఆయన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఇటీవలే అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందిన దుంపటి కిషన్‌కు రూ.52,500లు, కాదలి దుర్గాప్రసాద్‌కు రూ.30వేలు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తుందన్నారు. ప్రజాపాలనలో ప్రజాసంక్షేమం, ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో బి.శివకుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, అరుణ్‌కుమార్, మక్బుల్, మాటే శ్రీనివాస్, సూర్యనారాయణలు ఉన్నారు.

సిబ్బంది సమయ పాలన పాటించాలి

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉండడం, ప్రజల నుంచి నేరుగా సమస్యలను తెలుసుకుని సత్వరమే సమస్యలను పరిష్కరించేందుకు గ్రేటర్‌లోని ప్రతి డివిజన్‌లో ఒక వార్డు కార్యాలయాన్ని ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కుత్బుల్లాపూర్ డివిజన్ పద్మానగర్ ఫేజ్-2లో డివిజన్ వార్డు కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఒక కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు సహాయకులు అందుబాటులో ఉంటారు. కానీ ఆపరేటర్ సమయ పాలన పాటించడంలేదు. ఏమైనా దరఖాస్తు చేసుకునేందుకు వస్తే ఆపరేటర్ లేరని, రేపు రావాలని సహాయకురాలు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లినవారికి తెలపడం గమనార్హం. సమయ పాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



చెరువును పరిశీలిస్తున్న అధికారులు

చెరువు నీరు కలుషితం కాకుండా చర్యలు

నిజాంపేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్‌లోని చెరువులను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. మల్లంపేట గ్రామంలోని కొత్త కొండ చెరువు, చందన్ చెరువు నుంచి డ్రైనేజీ నీరు నిజాంపేట్‌లోని కొత్తకుంట చెరువు, చేనంచెరువుల్లో కలుస్తోంది. దీనివల్ల 23వ వార్డు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం సభ్యులు ఆంజనేయులు ముదిరాజ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఇరిగేషన్, మండల, మున్సిపల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ వచ్చి చెరువులను పరిశీలించి, చెరువులో డ్రైనేజీ కలువకుండా చర్యలు తీసుకుంటామని స్థానికులకు అధికారులు హామీ ఇచ్చారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

- బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ పూల్‌సింగ్

నిజాంపేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములను పరిరక్షించడమే ధ్యేయంగా పని చేస్తున్నామని బాచుపల్లి తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్ అన్నారు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివిధ సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను కాపాడాలని బీజేపీ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ విషయై బుధవారం తహసీల్దార్ ఆయా సర్వే నంబర్లలో పర్యటించారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించి నిర్మాణాలు చేపడుతున్న వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేదిలేదని, అవసరమైతే పోలీసులు కేసులు పెడతామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు భిక్షపతి యాదవ్, నరేంద్రచౌదరి, ప్రసాద్‌రాజులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధికి నోచుకోని బస్తీ రోడ్లు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలో 90 శాతం బలహీన వర్గాలకు చెందిన



సుభాష్‌చంద్రబోస్‌నగర్‌లోని మట్టి రోడ్డు

బస్తీలో ఉంటాయి. ఇక్కడ దినసరి కూలీలు, పరిశ్రమల్లో పని చేస్తూ ఉపాధి పొందే కార్మికులు, పండ్లు, కూరగాయల వ్యాపారులతో పాటు సాధారణ కుటుంబాలు నివాసముంటాయి. అయినా కూడా అందరితోపాటు ప్రభుత్వానికి ఆస్తి పన్నులు, ఇతర పన్నులను సక్రమంగా చెల్లిస్తుంటారు. కానీ జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యం... పాలకుల పట్టింపులేనితనం వీరికి శాపంగా మారింది.

సవతితల్లి ప్రేమను చూపుతూ బస్తీలను అభివృద్ధి చేయడంలేదని అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రౌడామేస్త్రీనగర్, వల్లభాయ్‌పటేల్‌నగర్, శ్రీనివాస్‌నగర్, న్యూలాల్‌బహదూర్‌నగర్, భగత్‌సింగ్‌నగర్ తదితర బస్తీలున్నాయి. ఈ బస్తీలన్నింటిలో ఎక్కడో ఒక చోట తప్ప ఎక్కడా అంతర్గత రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. మట్టిరోడ్లు, భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేసి ప్యాచ్‌వర్క్‌లు చేయకపోవడం, సీసీ రోడ్లు వేయకుండా వదిలేయడం జరుగుతోంది. తమ సమస్యలను పరిష్కరించాలని ఆయా బస్తీల ప్రజలు పాలకులు, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పట్టించుకున్న పాపనపోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్తీల్లో రోడ్లను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.




రౌడామేస్త్రీనగర్‌లో గుంతలుగా మారిన రోడ్డు



వంట గ్యాస్ ధరలు తగ్గించాలని నిరసన ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

వంటగ్యాస్ ధరలు తగ్గించేవరకు పోరాటం : సీపీఎం

షాపూర్‌నగర్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): కేంద్రం పెంచిన వంటగ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కమిటీ కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి శుభం హోటల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం షాపూర్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్, కమిటీ సభ్యులు బి.సత్యంలు మాట్లాడుతూ వంటగ్యాస్ ధరను రూ. 50లు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలం నుంచి పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను ఇష్టానుసారంగా పెంచిందన్నారు. అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దానికి అనుగుణంగా ధరలను తగ్గించాల్సిన కేంద్రం ఆయిల్ కంపెనీల లాభాల కోసం ప్రజలపై భారం మోపిందని ఆరోపించారు. గ్యాస్ ధరలు తగ్గించేవరకు సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు దేవదానం, కరుణాకర్, రావుల స్వాతి, ఎస్కె. ఖలీల్, జి.వెంకన్న, నర్సింహులు, గోపి, సాదులు పాల్గొన్నారు.



అధికారులు కూల్చిన షెడ్డు

అనుమతుల్లేని షెడ్డు కూల్చివేత

దుండిగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ బాచుపల్లి రోడ్డులో అనుమతులు లేకుండా వెలసిన షెడ్డును కమిషనర్ వెంకటేశ్వర నాయక్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది బుధవారం జేసీబీలతో కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి నిర్మాణానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అనుమతులు లేని పక్షంలో అక్రమంగా వెలిసిన నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుని నిర్మాణదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

విద్యుత్ అధికారుల సమాచారం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో అప్పుడప్పుడు గాలులు వీయడం వల్ల విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడం సహజం. అయితే అత్యవసర సమయంలో సమాచారం అందిస్తే సమస్యలను పరిష్కరిస్తామని కుత్బుల్లాపూర్ సబ్ డివిజన్ ఏడీఈ శ్రీకాంత్ తెలిపారు. మీ సమస్యలను తెలపడానికి ఈ కింది నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కుత్బుల్లాపూర్ సబ్ డివిజన్ ఏడీఈ - 9440816248, కుత్బుల్లాపూర్ సబ్ స్టేషన్ ఏఈ - 9440813161, జగద్గిరిగుట్ట సబ్ స్టేషన్ ఏఈ - 9440813881, కొంపల్లి సబ్ స్టేషన్ ఏఈ - 9440813166, గాజులరామారం సబ్ స్టేషన్ ఏఈ - 9491056564, పేట్ బషీరాబాద్ సబ్ స్టేషన్ ఏఈ - 8985533647

నిజాంపేట్‌లో జై భీమ్.. జై బాపూ జై సంవిధాన్

నిజాంపేట్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాజ్యాంగాన్ని అవమానిస్తూ, వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 18, 19 డివిజన్లలో 6వ రోజు జై భీమ్ జైబాపూ జై సంవిధాన్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్న నిర్ణయాలను, ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజల్లో తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో కొలన్ వీరేందర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నారాయణ. జీవన్‌రెడ్డి పాల్గొన్నారు.



18, 19 డివిజన్‌లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకులు

డివిజన్‌లో కాంగ్రెస్ పాదయాత్ర

పేట్‌బషీరాబాద్/షాపూర్‌నగర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డినగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో జైబాపూ జై భీమ్ జైసంవిదాన్ కార్యక్రమాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి డివిజన్ నాయకులతో కలిసి నిర్వహించారు. ఆదర్శనగర్ ఎన్టీఆర్ విగ్రహం నుంచి సుమిత్రానగర్ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మాగాంధీ, అంబేడ్కర్ త్యాగాలను ప్రజలకు తెలియ జేయాల్సి అవసరం ఉందని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు జయరామ్, శ్రీనివాస్, ఎల్లయ్య, జలీల్‌ఖాన్, శివకుమార్, మొహ్మద్ ఉస్మాన్, మాధవి, రాము పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



కుత్బుల్లాపూర్ సర్కిల్ శ్రీనివాస్‌నగర్‌లో రోడ్డుపై ఉన్న స్తంభం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ నుంచి చింతల్ వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. రోడ్ల విస్తరణ పేరుతో అధికారులు స్తంభాన్ని తొలగించకుండా సీసీ వేయించారు. రోడ్డుపై స్తంభం ఉండడంతో వాహనదారులు వేగంగా వస్తూ అనుకోనివిధంగా దానిని ఢీకొని ప్రమాదాలకు గురయ్యే అవకాశముందని స్థానికులు పేర్కొన్నారు. ఇటీవల ఓ ఆటో డ్రైవర్ స్తంభం ప్రమాదం నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్‌లో విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయింది. తీగల సహకారంతోనే నిలబడింది. భారీగా గాలులు వీస్తే కూలిపోయి, ప్రమాదాలు జరిగే అవకాశముందని, కొత్త స్తంభా న్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందుల్లో కుత్బుల్లాపూర్ మండల ప్రజానీకం

- తహసీల్దార్ లేక ఎక్కడి పనులు అక్కడే

గాజులరామారం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఉన్న సార్ లేడు.. ఇన్‌చార్జి సార్ రాడు అన్నట్లుంది కుత్బుల్లాపూర్ మండల కార్యాలయం పరిస్థితి. కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ రెహ్మాన్ సంవత్సరానికి పైగా విధులు నిర్వహించి లాంగ్ లీవ్‌లో వెళ్లడంతో కూకట్‌పల్లి తహసీల్దార్‌కు కుత్బుల్లాపూర్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. అప్పటినుంచి ఈయన చుట్టపు చూపుగా కార్యాలయానికి వస్తున్నారు. దీంతో పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈమధ్య కాలంలో రాజీవ్ యువవికాసం పథకం ప్రవేశపెట్టి అర్హులు కుల, ఆదాయ పత్రాలను జత పర్చాల్సిందిగా నిబంధనలు పెట్టింది. దీంతో కార్యాలయానికి దరఖాస్తు చేసుకునే వారి తాకిడి ఎక్కువైంది. కుల ధ్రువపత్రాల కోసం కార్యాలయం చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు పలు ధ్రువపత్రాల కోసం నెలల తరబడి తిరగడం తప్పడంలేదు. తహసీల్దార్ అందుబాటులో లేకపోవడంతో ఈ భారమంతా కిందిస్థాయి అధికారులపైనే పడుతోంది. అలాగే కుత్బుల్లాపూర్ మండల కార్యాలయం పరిధిలో ఎక్కువగా ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఈ భూములను కొందరు కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. ఇప్పటికే కొంతమంది కిందిస్థాయి అధికారులు ఈ కబ్జాలను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో అరికట్టలేక, సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారు. కొన్ని ముఖ్యమైన ఫైళ్లను మండల సిబ్బంది కూకట్‌పల్లి మండల కార్యాలయానికి తీసుకెళ్లి ఇన్‌చార్జి తహసీల్దార్‌తో సంతకాలు పెట్టించి తీసుకువస్తున్నారు. ఈ తతంగమంతా నాలుగు నెలల నుంచి జరుగుతోంది. ముఖ్యమైన పనులన్నీ అత్యవసర సమయాల్లో డిప్యూటీ తహసీల్దార్, ఇతర సిబ్బందిపైనే భారం పడడంతో ఒత్తిడికి గురవుతున్నారు. ఏది ఏమైనా తహసీల్దార్ ఎప్పుడు వస్తారో.. పనులను ఎప్పుడు చక్కబెడతారోనని కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని ప్రజలు ఎదురు చూస్తున్నారు.



కుత్బుల్లాపూర్ మండల కార్యాలయం సముదాయం



దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చిన ప్రజలు



తనిఖీ చేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర నాయక్

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దు

- దుండిగల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్

దుండిగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : దుండిగల్ మున్సిపాలిటీ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ బుధవారం మున్సిపల్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, కిరాణ దుకాణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాన్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. 120 మైక్రాన్‌ల కన్న తక్కువగా ఉన్న ప్లాస్టిక్‌ను వాడొద్దని, ప్లాస్టిక్‌కు బదులుగా జ్యూట్ బ్యాగులు, చేతి కర్ర సంచులు వినియోగించాలని తెలిపారు. మున్సిపాలిటీలో ప్రత్యేక బృందాలను నియమించామని, నిరంతరం నిఘా పెట్టి చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో భాగంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ సంచులను ఉపయోగిస్తున్నా షాపులకు రూ.8500 జరిమానా విధించారు. కార్యక్రమంలో మేనేజర్ లక్ష్మయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ స్వాతి, వార్డు ఆఫీసర్లు, జవాన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేయాలి



రంగారెడ్డినగర్ డివిజన్‌లోని ఐడీపీఎల్ చౌరస్తా నుంచి బాలానగర్ వరకు పాదచారులు నడవడానికి లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ఫుట్‌పాత్ ప్రస్తుతం నడవడానికి వీలు లేకుండా మారింది. అధికారులు స్పందించి ధ్వంసమైన ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేయాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

- పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి)

తాగునీరు.. రోడ్డుపాలు



జీడిమెట్ల డివిజన్‌లోని హెచ్ఏఎల్ రాఘవేంద్ర కాలనీ అమ్మవారి కమాన్ సమీపంలో తాగునీరు సరఫరాకు వాల్వ్‌ను ఏర్పాటుచేశారు. కాలనీలకు తాగునీరు విడుదల చేసినప్పుడల్లా ఆ వాల్వ్ నుంచి గ్యాలన్ల కొద్దీ నీరు రోడ్డు పాలవుతోంది. దీనికి మరమ్మతులు చేపట్టినా సమస్య మరలా ఉత్పన్నమౌవుతుందని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్య పునరావృత్తం కాకుండా వాల్వ్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

- పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి)

శుభాకాంక్షలు



ఒడిశా గవర్నర్ డా.కె.హరిబాబును మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బీజేపీ అధ్యక్షులు డా.ఎస్.మల్లారెడ్డి రాజ్‌భవన్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

- దుండిగల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి)